విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 23 మార్చి 2025 8 పేజీలు

రైతుల భాగస్వామ్యంతో

నీటి సంరక్షణ పనులు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా రైతుల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ కార్యక్రమాలను పటిష్టంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలులోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జలశక్తి కేంద్రాన్ని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ లతో కలిసి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాల నమూనాలను పరిశీలించారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో నిర్మించనున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రకాశం జిల్లా మొత్తం క్షామ పీడిత ప్రాంతమని, జిల్లాలో నీటి సంరక్షణ చాలా అవసరమన్నారు. భావితరాలకు నీటిని అందించాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈరోజు అత్యంత సంపద ఏదైనా ఉందంటే అది నీరేనని మంత్రి అన్నారు. సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారమని, భావితరాలకు నీరందించాల్సిన బాధ్యత మనదే అని మంత్రి అన్నారు. ప్రజలకు జీవనాధారమైన నీటి సంపదను సంరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినడం, పచ్చదనాన్ని నిర్మూలించడం వంటి కారణాల వలన నేడు మనమంతా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా మిగతా 2 లో ...

లారీని ఢీ కొన్న బస్

- 12 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు
- విద్యార్థులను పరామర్శించిన ఎస్పీ
- రహదారి భద్రత నిబంధనలు పాటించాలి
- ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నంకు చెందిన విద్యార్థులు 45 మంది బాలురు, 43 బాలికలు మరియు 11 మంది ఉపాధ్యాయులు సైన్స్ ఫెయిర్ నిమిత్తం బుధవారం మచిలీపట్నం నుండి మూడు బస్సులలో బయలుదేరారు. 20 వ తేదీన చెన్నై లో లెదర్ టెక్నాలజీ కాలేజీ , 21 న తిరుపతిలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జూ పార్క్ పలు ప్రదేశాలను సందర్శించి, సైన్స్ ఫెయిర్ ముగించుకుని తిరుగు ప్రయాణంలో 21 న రాత్రి సుమారు 10 గంటలకు 3 బస్సులలో బయలుదేరిన విద్యార్థిలు బస్సు మిగతా 2 లో ...

వ్యవసాయం,మత్స్యసంపద

ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం

- బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : వ్యవసాయం,మత్స్య సంపద ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం వృద్ధి అయ్యే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.వివిధ శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్లోని సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు.వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు 10.70 శాతం లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందులు లేని సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో 28,184 హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం సాగు చేశామన్నారు.ఏడు శాతం ఉత్పత్తి పెరుగుదల అయ్యేలా 30,998 హెక్టార్లకు సేంద్రియ వ్యవసాయం సాగు లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. తద్వారా జిల్లాకు రూ.4,943 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.మత్స్య సంపద,ఆక్వా సాగు ద్వారా ఏడాదిలో రూ.12,440 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు.ఏడాదిలో 13.41 వృద్ధిరేటు సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధిపై రూపొందించే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.అతి తక్కువ నిధులతో ఆరు బీచ్‌లను అభివృద్ధి చేయడం ద్వారా ఏడాదికి రూ.535 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు.పర్యాటకంపై 18.88 వృద్ధిరేటు ఉంటుందన్నారు.అటవీ సంపద వృద్ధి చేయాలని ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఉద్యాన పంటలు అదనంగా 1,650 హెక్టార్లకు విస్తరింప చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకోవాలని మిగతా 2 లో ...

పదోన్నతుల సీనియర్

జాబితాను తయారు చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు: ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా నందు ఉన్న తప్పులను సవరించి మెరిట్ కం రోస్టర్ ప్రకారం తయారు చేయాలనీ ఎస్టీయూ జిల్లా శాఖ పక్షాన జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ ఎస్‌జిటి నుండి స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతులు కల్పించినప్పుడు మెరిట్ కం రోస్టర్ విధానం పాటించకుండా సెలక్షన్ ప్రకారం పదోన్నతులు మిగతా 2 లో ...

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.కార్మికులకు అల్ప వేతనం,ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలకు చాలా తక్కువ వేతనం లభిస్తోంది,పెరుగుతున్న నిత్యావసర ధరలతో చాలాచోట్ల ఆయాల జీవనోపాధికి సరిపోవడం లేదు పాఠశాలలకు సెలవులు ఇస్తే సగం వేతనం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది ఇచ్చేదే చాలి చాలని జీతం అందులోనూ కోతలు విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వ పాఠశాల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదవీ స్థిరత లేకపోవడం : ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలను తాత్కాలికంగా నియమించడం వల్ల ఉద్యోగ భద్రత లేదు,ప్రభుత్వ అధికారం మారిన ప్రతిసారి అధికార పార్టీ నాయకుల వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి ఇప్పటికైనా నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలల ఆయాలు మధ్యాహ్న భోజన కార్మికులకు మిగతా 2 లో ...

రైతుల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు

(మొదటిపేజీ తరువాయి)

కరువు ప్రాంతాల్లో పంటకుంటలు, చెక్ డ్యామ్ లు, ఇంకుడు గుంతల నిర్మాణాలతో పాటు ఇంటి రూఫ్ వాటర్ ని నిల్వ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. జిల్లాలో వాటర్ గణాంకాల ప్రకారం 12 మండలాల్లో 93 గ్రామాల్లో భూగర్భ జలాలు బాగా అడుగంటినవని, ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుకు నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. డ్వామా అధికారులు నీటి సంరక్షణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో జిల్లాలో నీటి సంరక్షణ కార్యక్రమాలను పటిష్టంగా అమలు జరిగేలా కృషి చేయాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టే నీటి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎ . తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లా నీటి యాజ్యమాన్య సంస్థ తో పాటు ఇరిగేషన్, గ్రామీణ మంచి నీటి సరఫరా, భూగర్భ జల శాఖలను సమన్వయం చేస్తూ డ్వామా కార్యాలయం లో జల శక్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రం నుండి జిల్లాలో నీటి సంబంధిత సమస్యలతో పాటు నీటి సంరక్షణ కు చేపట్టే కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. రాబోవు మూడు, నాలుగు నెలల్లో నీటి సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. జిల్లాలో చేపట్టే నీటి సంరక్షణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకర రావు, భూగర్భ జల శాఖ డిడి విద్యా సాగర్, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం,మత్స్యసంపద ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం

కలెక్టర్ చెప్పారు.విస్తీర్ణం పెరుగుదలతో ఉత్పత్తులు అధికం అవుతాయని తద్వారా రూ.4,065 కోట్ల ఆదాయం జిల్లాకు వస్తుందన్నారు.11.49 శాతం వృద్ధిరేటు సాధన దిశగా ముందుకు సాగాలన్నారు.మూడువేల హెక్టార్లలో సూక్ష్మ,బిందు సేద్యం సాగయేలా రైతులను చైతన్య పరచాలన్నారు.రానున్న ఏడాదిలో 20శాతం వృద్ధిరేటు సాధన దిశగా అధికారులు అడుగులు వేయాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా సంప్రదాయ పద్ధతిలో 54,654 గేదెలు,ఆవులు ఉత్పత్తి చేయాలని లక్ష్యం కాగా, కృత్రిమ పద్ధతిలో 49,675 గేదెలను ఉత్పత్తి చేయాలన్నారు. దీంతో పాల దిగుబడి మరింత పెరిగి ఆదాయం రూ.6,630 కోట్లకు చేరే లక్ష్యంతో 15.20 శాతం వృద్ధిరేటుగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రానైట్,ఇసుక, కంకర వనరులతో రూ.110 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు.అలాగే సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణతో వార్షికాదాయం రూ.1,941 కోట్లకు పెరిగేలా లక్ష్యాలు రూపొందించాలన్నారు. తద్వారా 37.51శాతం వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రైల్వే లైన్ ద్వారా రూ.109 కోట్ల ఆదాయం వస్తుందన్నారు.తాజాగా రైల్వే గూడ్స్ రేకో వంటి తదితర వనరులతో ఏడాదిలో వృద్ధిరేటు 5.83శాతం పెరగనందన్నారు.గ్రామీణ నీటి సరఫరా మరింత పెంచడానికి రూ.167 కోట్లు పనులు చేయాలని ఆయన తెలిపారు.ప్రజా ప్రయోజనం కొరకు పైప్ లైన్ల నిర్మాణం పెంచాలన్నారు.విద్యుత్ శాఖ ద్వారా రూ.731 కోట్లు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రచించాలన్నారు.ప్రస్తుతం రూ.17.91 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణాలు లక్ష్యంగా పనులు చేపడుతామన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్,అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల సీనియర్ జాబితాను తయారు చేయాలి

కల్పించడం వల్ల పదోన్నత జాబితాలో తప్పులు తడకలుగా ఉందన్నారు. ఇప్పుడైనా మెరిట్ కం రోస్టర్ ప్రకారం తయారు చేయాలని అలాగే 2023 లో కోర్టు కారణంగా నిలిచిన పదోన్నతులు ముందుగా జరిపిన తర్వాతనే పదోన్నతులు కల్పించాలని కోరారు. పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం నుండి మినహాయింపు కో రిన వారికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి జి నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు నర్రా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగ భద్రతా కల్పించాలని రాజకీయ వేధింపులు ఆపాలని కార్మికులు కోరుతున్నారు.

సమయపాలన సమస్యలు : మధ్యాహ్న భోజనం,ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయాల్సిన అవసరం వస్తోంది, సమయానికి మించి పనిచేస్తున్నప్పటికీ అదనపు భత్యం ఉండదు అధికారుల వద్ద గౌరవం లభించదు.ఏడాది మొత్తం పనిచేస్తున్నప్పటికీ కనీస సెలవులు సైతం ప్రభుత్వ పాఠశాలలో పని చేసే కార్మికులకు లేవు,కూటమి ప్రభుత్వం అయిన కార్మికులకు సెలవులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

సామాజిక భద్రత లేదు : ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఈపీఎఫ్,ఈఎస్ఐ వంటి సదుపాయాలు లేదు.ఆయాలకు ప్రభుత్వం ఆరువేలు,మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు వేలు మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నారు ఇది కార్మికుల జీవన భృతికి ఏ మాత్రం సరిపోవడం లేదు ఎన్నికల ముందు హామీలు మాత్రమే రాజకీయ పార్టీలు ఇస్తున్నాయి కానీ అధికారం చేపట్టాక ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే కార్మికుల సమస్యలు గలికొదిలేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి : కూటమి ప్రభుత్వం 108జీవో నీ పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచాలని అయాలకు రూ.11500 గౌరవవేతనం ,మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000లకు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ప్రభుత్వ అధికారం మారిన ప్రతిసారి రాజకీయ వేధింపులకు గురి అవుతున్న ఆయాలను కాంట్రాక్ట్ లేదా తాత్కాలిక పద్ధతిలో కాకుండా రెగ్యులరైజ్ చేయాలనీ,భీమా,ఈఎస్ఐ,పిఎఫ్,పెన్షన్ సదుపాయాలు కల్పించాలనీ ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుంది.

సముచిత గుర్తింపు : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తల్లి దండ్రుల వద్ద కంటే పాఠశాలలోనే ఎక్కువగా ఉంటారు ప్రభుత్వ ఆదేశాలమేరకు ఆరోగ్య కరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు ఇలాంటి వారికి ఉన్నతాధికారులు వస్తున్న స్థానిక శాసన సభ్యులు వస్తున్న ఉరుకుల పరుగుల పెడతారు మినహాయించి ఏదైనా పొరబాటు జరిగితే అధికారులచే మొదటిగా అక్షింతలు పడేది వీరికే ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆయాల హోదాకు అధికారిక గుర్తింపు ఇవ్వాలనీ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస గౌరవం ఇవ్వాలని కోరుతున్నారు.

పని గంటలు పెరిగితే అదనపు భత్యం : ప్రభుత్వ పాఠశాల కార్మికులు ఎక్కువ పని చేసినప్పుడు అదనపు భత్యాన్ని అందించాలి. ఏఐటియూసి లేవనెత్తిన ప్రభుత్వ పాఠశాల కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటే ఆయాల జీవన ప్రమాణాలు మెరుగవు తాయని,ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయా సంఘాలు, కార్మిక సంఘాలు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు,ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగేశ్వరరావు, ప్రభుత్వ పాఠశాలల ఆయా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుజాత,కోటి జ్యోతి,సూకరత్నం, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

హామీలు పట్టించుకోని ప్రభుత్వం

-షేక్ షాహినా

గత 22సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్నానని షేక్ షాహినా తెలిపారు.ప్రభుత్వం ప్రతి సారి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారన్నారు.అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను గాలి కొదిలేస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం న్యాయమైన తమ కోర్కెలు నెరవేర్చాలన్నారు.

బకాయిలు చెల్లించాలి

- ప్రభుత్వ పాఠశాల కార్మికురాలు చాముండేశ్వరి

గత ఇరవై ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో కార్మికురాలిగా పని చేస్తున్నాని ప్రభుత్వ పాఠశాల కార్మికురాలు చాముండేశ్వరి తెలిపారు.కార్మికులకు ప్రభుత్వం సరిగ్గా జీతాలు అందించదు ఇప్పటికీ ఆరు నెలల జీతాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు.

కార్మికుల డిమాండ్ల పరిష్కరించాలి

ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్

ప్రభుత్వ పాఠశాలలో పని చేసే కార్మికులకు సెలవులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. పాఠశాలకు సెలవులు ఇచ్చినప్పటికీ కార్మికులకు పూర్తి వేతనం చెల్లించాలని,కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు.

లారీని ఢీ కొన్న బస్

(మొదటిపేజీ తరువాయి)

- 12 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు
- విద్యార్థులను పరామర్శించిన ఎస్పీ
- రహదారి భద్రత నిబంధనలు పాటించాలి
- ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్

ప్రకాశం జిల్లా ఎన్హెచ్ 216 జాతీయ రహదారి తెల్లవారుజామున నాగులుప్పలపాడు ఉప్పుగుండూరు మధ్య ఆగిన ఉన్న లారీని ఢీ కొన్నగా బస్సులో ప్రయాణిస్తున్న 12 మంది విద్యార్థులకు స్వల్ప రక్త గాయాలు అయ్యాయి. విద్యార్థులను 108 లో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ లో వైద్య చికిత్స పొందుతున్న 12 విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి, ప్రమాదం జరిగిన తీరును, ప్రమాదానికి గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆందోళన చెందవద్దని, మనోధైర్యంతో ఉండాలని, వారికి ధైర్యం నింపి, వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలోని డాక్టర్లు తో మాట్లాడి మెరుగైన ట్రీట్మెంట్ అందించాలని సూచించారు.అలాగే జిల్లా ఎస్పీ విద్యార్థులతో మాట్లాడి, వారి తల్లిదండ్రుల వివరాలను తెలుసుకొని, వారి ఫోన్ నెంబర్లకు ఎస్పీ తన ఫోన్ ద్వారా కాల్ చేసి మాట్లాడి, వీడియో కాల్ ద్వారా వారి పిల్లలతో మాట్లాడించారు. జరిగిన సంఘటన గురించి తెలియచేసి స్వల్ప గాయాలు తగిలాయని వాళ్ళు తల్లిదండ్రులకు విద్యార్థులు తెలియపరిచారు. జిల్లా ఎస్పీ గారు తల్లిదండ్రులతో కూడా మాట్లాడి స్వల్ప గాయాలు తగిలాయని ఆందోళన చెందవద్దన్నారు. మరొక బస్సులో విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానానికి పంపిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ఫ్రూట్స్ మరియు అవసరాల నిమిత్తం ఉపాధ్యాయునికి నగదు కూడా అందజేశారు. పోలీసు శాఖ అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరల జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పక పాటించాలని, డ్రైవర్లు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి పరిమితమైన వేగంతో వెళ్ళాలని, రహదారి భద్రత సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు, యాత్రికులు ప్రతి ఒక్కరూ ప్రయాణ జాగ్రత్తలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో సహనంతో ఉండి సురక్షితంగా, క్షేమంగా గమ్యాన్ని చేరాలని కోరారు.జిల్లా ఎస్పీ ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా అజయ్ కుమార్, ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, ఎస్సైలు శ్రీకాంత్ బాబు, అజయ్ బాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రోకార్బన్ అన్వేషణ ప్రాజెక్టులపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు: గత ఐదు సంవత్సరాలలో దేశం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైడ్రోకార్బన్ అన్వేషణ ప్రాజెక్టులు, పథకాలు , కార్యక్రమాలు, కనుగొన్న నిల్వలు, కేటాయించిన, వాడిన నిధుల మరియు నైపుణ్యం,శిక్షణ చర్యల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు.దీనికి కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖ సహాయక మంత్రి, సురేష్ గోపి సమాధా నమిస్తూ ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ కాంట్రాక్టు ఒప్పందంతో హైడ్రోకార్బన్ అన్వేషణ ప్రాజెక్టులను అమలు చేస్తాయని, దీనికి ప్రభుత్వం ఏమీ ఖర్చు చేయదని, గత 5 సంవత్సరాలలో దేశంలో ప్రభుత్వం 96 బ్లాకులు ఇవ్వగా, అందులో ఆంధ్రప్రదేశ్ లో 3 బ్లాకులు ఇవ్వబడ్డాయని, జాతీయ చమురు కంపెనీలు సహజ వాయువుల వనరులను కను గొనుటకు మరియు మూతబడిన చమురు గ్యాస్ బావులు తిరిగి తెరుచుటకు ప్రభుత్వం పలు విధాన మరియు సాంకేతిక చొరవలు చేపట్టిందని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించవద్దని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు.. శనివారం ఉదయం గిద్దలూరు పట్టణం, గణేష్ నగర్, 1,2,3,4 వార్డులకు చెందిన సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది మొత్తం హాజరు అయ్యారా లేదా అని వాకబు చేశారు. ప్రజలు వారి అవసర నిమిత్తం సచివాలయం వచ్చినప్పుడు వారికి తగిన సూచనలు ఇస్తూ వారి దరఖాస్తును సకాలంలో పరిష్కారం చేసి వారికి అందచేసే విధంగా జవాబుదారీ తనంతో విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలను, సచివాలయాలను, తప్పనిసరిగా తనిఖీ చేస్తానని, ప్రజల నుంచి తనకు ఎటువంటి పిర్యాదులు అందిన శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజా పాలనే లక్ష్యంగా పాలన కొనసాగిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ కమీషనర్ ఐ. శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేషావలి, పట్టణ కౌన్సిలర్లు బిల్లా రమేష్, పాలుగుళ్ళ చిన్న శ్రీనివాసరెడ్డి, లోక్కు రమేష్, దేమా శ్రీరాములు, మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు చోరీ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రైతులు ఆరుగాలం పండించిన పొగాకు బేళ్లు చోరీకి గురైన సంఘటన మండల కేంద్రమైన పుల్లలచెరువులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పుల్లలచెరువు -శతకోడుకు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో రైతులు గాలి కోటయ్య, సీహెచ్ సందేశ్, రాజేశ్వరరావులు పొగాకును పండించుకుని మార్కెట్ యార్డుకు తరలించేందుకు తమ పొలాల్లో 30 బేళ్లను సిద్ధంగా ఉంచుకోగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సదరు రైతులు లబదిబోమంటున్నారు. ఈ విషయంపై పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు.

హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను పరిశీలన

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని భవిత కేంద్రం ఐఆర్పీల ఆధ్వర్యంలో ప్రతి శని వారం జరిగే హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను మండల విద్యాశాఖ అధికారి యం.జె ఇందిరా ప్రసాద్ కవలకుంట్ల గ్రామం నందు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థి తల్లిదండ్రులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ. ఈ. ఆర్. పి టి . తేజ రూపిణి మరియు విద్యార్థి తల్లి పాల్గొన్నారు.

సాధికార సారథులతో టీడీపీ బలోపేతం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : తెలుగుదేశం పార్టీని బలోపేతం దిశగా సాధికార సారథులు మరింత కృషి చేయాలని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు స్పష్టం చేశారు. శనివారం యర్రగొండపాలెం లోని టీడీపీ కార్యాలయంలో నాయకులతో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో సాధికార సారథులు పార్టీ గెలుపుకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరమో వారికి తెలుసని చెప్పారు. పథకాలు అందని వారికి, సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారిని సాధికార సారథులే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న సాధికార సారథులను పార్టీ సభ్యులు కూడా సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. గత ఎన్నికల్లో వారంతా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే తెలుగుదేశం పార్టీకి ఎదురు ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికునికి భరోసా

విశాలాంధ్ర-కొమరోలు : అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి మాజీ సర్పంచ్ అండగా నిలిచారు. కొమరోలు మండలం బెడుసు పల్లె గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు దమ్ము అల్లూరయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా కుటుంబానికి పంచాయతీ మాజీ సర్పంచ్ బాలిరెడ్డి, సుమిత్ర ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బాలిరెడ్డితో పాటు పారిశుధ్య కార్మికుల మండల యూనియన్ అధ్యక్షుడు గోపాల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మెట్ట రైతులకు ఫారంపాండ్ వరం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మెట్ట ప్రాంత రైతులకు ఫారం పాండ్ పనులు అత్యంత మేలు చేకూరుస్తాయని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చే పనులకు ప్రాధాన్యత ఇస్తుందని, రైతులందరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవలసినదిగా ఎంపీడీఓ మహబూబ్ బాషా కోరారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం ఇమ్మడి చెరువు గ్రామంలో ఫారం పాండ్ పనిని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ లోనీ గ్రామాలలో కనీసం పది ఫారం పాండ్ పనులు పూర్తి చేయుట లక్ష్యం గా నిర్ణయించినారు. ఆ లక్ష్యాలను చేరుకొనేలా సిబ్బంది పనిచేయాలని, అందుకు రైతులు, ఉపాధిహామీ కూలీలు సహకరించాలని కోరారు. ఈ క్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతులు ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు చేయనున్న ఫారం పండ్లను నియమించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస నాయక్, ఈసీ మనోహర్ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ప్రతి గ్రామంలో శానిటేషన్ పట్ల కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి సురేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రం నందు రెండో రోజు అయినా శనివారం చెత్త నుండి సంపద తయారీపై చీమకుర్తి మండల స్థాయి కార్యదర్శులు క్లాప్ మిత్రల శిక్షణ తరగతులు జరిగాయి . అనంతరం ఈ ఓ ఆర్ డి రవణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్ పట్ల ఎంతో సీరియస్ గా ఉందని, కార్యదర్శులు తమ తమ గ్రామాల పరిధిలో దీనిపట్ల తగు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు శానిటేషన్ స్ట్రీట్ లైట్స్ పై తడి చెత్త నుండి వచ్చే కంపోస్ట్ సంపద ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాలను పెంపొందించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. గుంటూరు కళా జాత బృందం ప్రతినిధి ఉమా శంకర్ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్త, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, తదితర వాటిపై నిర్వహించిన కళాజాత ప్రోగ్రాం పలువురిని ఆకట్టుకున్నది. ఈనెల 24న నాగులుప్పలపాడు మండలం, 25న మద్దిపాడు మండలం కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సంతనూతలపాడు లోని చెత్త సంపద తయారీ కేంద్రంలో ఆయా కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు శిక్షణ తరగతులు జరగనున్నవి. పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ కుమార్ రిసోర్స్ పర్సన్స్ చీమకుర్తి ఈఓఆర్డి పి అజితా పల్లామల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. చీమకుర్తి మండల కార్యదర్శులు, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు హైవేపై రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సమీపంలో ఎన్ హెచ్ 216 జాతీయ రహదారిపై శనివారం ఉదయం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన విద్యార్థులు 45 మంది బాలురు 43 మంది బాలికలు 11 మంది ఉపాధ్యాయులు సైన్స్ ఫెయిర్ నిమిత్తం 19వ తేదీన మచిలీపట్నం నుండి మూడు బస్సుల్లో బయలుదేరి చెన్నై లెదర్ టెక్నాలజీ కాలేజీ తిరుపతిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తో పాటు పలు ప్రదేశాలు సందర్శించి సైన్స్ ఫెయిర్ ముగించుకొని తిరుగు ప్రయాణంలో బయలుదేరారు. వీటిలో ఏపీ 16 టి సి 5700 నంబర్ ప్లేట్ కలిగినటువంటి బస్సు తెల్లవారుజామున ఉప్పుగుండూరు మధ్య ఆగి ఉన్న లారీని ఢీకొట్టడం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న 13 మంది విద్యార్థులకు 3 టీచర్లు స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం విద్యార్థులను టీచర్లను 108లో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సదరు ప్రమాదం పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేపచెట్టు నరికివేత

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర ఉన్న టీ స్టాల్ షాప్ వద్దు ఉన్న వేప చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి నరికివేశారు. వేసవిలో చల్లని నీడనిచ్చే చెట్టును నరికివేయటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీ కొట్టుకు ఎక్కువ మంది టీ తాగేవారు రావటం చూసి ఓర్వలేకనే ఈ పనిచేశారని స్థానికులు పేర్కొంటున్నారు.

కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-వెలిగండ్ల: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి ఈ నెల 22 నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ సుశీల తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతికి 40 సీట్లు ఇంటర్ మొదటి సంవత్సరానికి 40 సీట్లు ఎంపీసీ ఇంగ్లీష్ మీడియంలో ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 7, 8, 9 ,10, ఇంటర్ సెకండియర్ కు ఆయా ఖాళీలను బట్టి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 11 వరకు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు స్వీకరిస్తామన్నారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుశీల కోరారు.

సమస్యల పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సమస్యల పరిష్కారానికే సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సీపీఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య ,జిల్లాకార్యదర్శి ఎస్ కె మాబు ,జిల్లానాయకులు జె జయంతిబాబు, మండలకార్యదర్శి టి శ్రీకాంత్ తదితర బృందం మండలంలోని ఉప్పుగుండూరు చింతతోపులోని ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా కాలనీ వాసులు కనీసం మౌలిక వసతులకు కూడ నోచుకోవడం లేదని సమస్యలను బృందం దృష్టికి తీసుకు వచ్చారు ఆ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఇఓ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందచేసారు. సీపీఎం మండలకార్యదర్శి టి శ్రీకాంత్, యు వెంకటేశ్వర్లు, ఎన్ రామారావు, కె శ్రీనివాసరావు, జి బసవపున్నయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోస్కో చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిసి వారి ఆధ్వర్యంలో పోస్కో చట్టం పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ జడ్జి ,ఫోక్సో కోర్టు మిన్ శైలజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ చట్టం లైంగిక నేరాల నుండి పిల్లలను ఏ విధంగా తమను తాను రక్షించుకోవాలో వివరిస్తుంది. లైంగిక వేధింపులు మరియు అశ్లీలత వంటి నేరాల నుండి పిల్లలని రక్షించడానికి మరియు మరియు అటువంటి నేరాల విచారణ కోసం సంబంధించి ప్రత్యేక కోర్టులను ఈ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మరియు సెక్రటరీ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివికె మూర్తి, డైరెక్టర్ అడ్మిషన్ వీరాంజనేయులు,రమణ బాబు,అకాడమిక్ డీన్ సుబ్బారావు,టిఅండ్ పి డీన్ రూప ఆకాష్,ఐసీసీ కన్వీనర్ వైష్ణవి,కళాశాల మహిళా సిబ్బంది మరియు కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంబీఏ విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయతీలో గల వెలుగొండ క్షేత్రం లో వెలసిన వెలుగొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల భాగంగా రెండవ రోజు శనివారం తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజానీకం తరలివచ్చి పోటీలను తిలకించారు. శుక్రవారం జరిగిన న్యూ క్యాటగిరి పోటీల్లో మొత్తం 11 జతల ఎద్దు పాల్గొన్నాయని నిర్వాహకులు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి మండల నాయకుడు జవాజి భాషపతి నాయుడు తెలిపారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు సీనియర్ విభాగంలో పోటీలు ఆదివారం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెఫరీలు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్‌లో వీడ్కోల వేడుకలు

విశాలాంధ్ర- ఒంగోలు: ఒంగోలులోని మంగమూర్ రోడ్ లో గల ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ వై రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకునే దిశగా ప్రతి ఒక్కరూ అడుగు వేయాలన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు అపాయింట్మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థుల నృత్యాలు, స్కిట్లు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి రాజశేఖర్ రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ అధికారి టి రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

మత విధ్వంసాలు సృష్టిస్తున్న బీజేపీ: కైపు

విశాలాంధ్ర - తాళ్లూరు: ఆల్ ఇండియా అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కార్యవర్గ సమావేశంలో ఏపీ అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్‌పార్టీ చైర్మన్, దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కైపు క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలో శనివారం ఇందిరా భవన్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఏపీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు గిట్టుబాటు ధర లేక పడుతున్న ఇబ్బందులు, బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ పై అవలంభిస్తున్న విధానాన్ని దుయ్య బట్టారు. దొనకొండలో ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకురాకపోకపోవటంపై, బిజెపి చేస్తున్న మతాల మధ్య గొడవలు, ఏపీలో జరుగుతున్న అఘాయిత్యాలపై కార్యవర్గ సమావేశంలో తీసుకువచ్చారు. అనంతరం మధ్య ప్రదేశ్ మాజీ సీఎం, ఏపీ వ్యవహారాల మాజీ ఇన్చార్జి దిగ్విజయ్ సింగ్ కలిసి ఏపీలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు.

ఎస్సీ హాస్టల్‌ను తరలించే ఆలోచన విరమించుకోవాలి

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థులకు సంబంధించి ఎస్సీ హాస్టల్ ను వేరే ప్రాంతానికి తరలించే ఆలోచనను విరమించాలని సీపీఐ మండల కార్యదర్శి జి పి రామారావు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నంసింహారెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగింది. నియోజకవర్గం లోని ఎస్సీ విద్యార్థులు చదువుకోవటానికి ఉన్న ఒకే ఒక్క ఎస్సీ హాస్టల్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం, అధికారులు ఆలోచిస్తున్నారని ఆ ఆలోచనను విరమించుకోవాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కనిగిరిలో ఎస్సీ హాస్టల్ నిర్వహించబడుతుందని ఉన్నఫలంగా హాస్టల్ వేరొక ప్రాంతానికి తరలిస్తే నియోజకవర్గం లోని ఎస్సీ విద్యార్థులు వారి ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ఎస్సీ హాస్టల్ ను కనిగిరిలోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఏఐటీయూసీ నాయకులు ఖాసింపీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పట్టణ కన్వీనర్ గూడూరు సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి

-బహుజన రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానం

-ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా వలపర్ల మోషబాబు ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్రంలో ప్రభుత్వం మిగులు భూములు అన్యాక్రాంతం కాకుండా నిరుపేదలకు పంచాలని బహుజన రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనివారం మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల స్థానిక కార్యాలయంలో బహుజన రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి నాగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వడ్లపల్లె శ్రీనివాసులు మాట్లాడుతూ భూమి ఉంటే భుక్తి కలుగుతుంది తద్వారా ఆత్మగౌరవం పెంపొంది సమానత్వం ఏర్పడుతుంది కనుక పేదలకు భూములను పంచి సమానత్వం కోసం పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి నాగయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు వరప్రసాదిని అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని అందుకు కావాల్సిన 2000 కోట్ల నిధులు మంజూరు చేయాలని, నిర్వాసితులను ఆదుకోవాలని, వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అందజేయాలని కోరారు. సామాజిక ఉద్యమ నాయకులు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డును అందజేసిన కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీకి, 30 సంవత్సరాలుగా పోరాటాల ఫలితమైన ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ తీర్మానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెదారుడు మండలంలోని సానికవరం మద్దెల కట్ట కంభంపాడు గ్రామాలలో ఇతరుల పేర్లు మీద ఆక్రమితమై ఉన్న ప్రభుత్వ అసైన్మెంట్ భూములను పేదలకు పంచాలని కోరారు. ప్రకాశం జిల్లా బహుజన రైతు సంఘం అధ్యక్షులుగా పెద్దారవీడు గ్రామానికి చెందిన న్యాయవాది వలపర్ల మోష బాబును జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి నాగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన రైతు సంఘం కార్యదర్శి జడ్డా లక్ష్మయ్య, కాకర్ల రాజయ్య, కటికల పిచ్చయ్య, జడ్డా అబ్రహం, బెజవాడ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో సిఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

ఎస్పీ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు: దేశ శాంతి భద్రతలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ప్రముఖ పాత్ర పోషిస్తుందని, సురక్షిత తీరం, తీర ప్రాంత పరిరక్షణకు ప్రజలను మమేకం చేసేందుకే లక్ష్యంగా చేపట్టిన సైకిల్ ర్యాలీ అభినందనీయమని జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుండి (సిఐఎస్ఎఫ్) సముద్ర తీర సైకిల్ ర్యాలీని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్, సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు రాకుండా, మాదక ద్రవ్యాల రవాణా సాగకుండా చూడటంలో తీర ప్రాంత ప్రజలు కీలకంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సిఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ శనివారం ఉదయం ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయమునకు చేరుకుంది. జవాన్లకు పోలీసులు,ఎన్‌సిసి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న సిఐఎస్ఎఫ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిస్తూ వారు చూపుతున్న దేశభక్తి, అంకితభావం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 7 న కోల్‌కత్తా సమీప బక్కలి, వెస్ట్ బెంగాల్ నుంచి ఈ ర్యాలీ మొదలైందని ఈనెల 31న కన్యాకుమారి చేరుకుంటుందన్నారు. సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్,ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ బి ఇనిస్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ సీఐ సూర్య నారాయణ, ఒంగోలు టౌన్ సీఐలు నాగరాజు, అజయ్ కుమార్, శ్రీనివాసులు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమణారెడ్డి ,సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ ఒకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర - తాళ్లూరు: శివరాంపురం కు చెందిన పోటు రామాంజ నేయులు , కొణికి కోటేశ్వరరావు కుటుంబాల మధ్య శనివారం తెల్లవారు జామున ఘర్షణ చోటు చేసుకున్నది. స్థలం విషయంలో జరిగిన వివాదంతోనే ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలు అయి పరిస్థితి విషయంగా ఉంది. ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవినీతికి పాల్పడ్డ ప్రిన్సిపల్

విశాలాంధ్ర - చీమకుర్తి : చీమకుర్తి పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం ప్రవీణ్ కుమార్ స్కూల్లోనే అవుట్సోర్సింగ్ ఉద్యోగి జీతం బిల్లింగ్ చేసేందుకు రూ. 17,500 లంచం తీసుకుంటుండగా నెల్లూరు ఏ.సీ.బీ. డిఎస్పీ శిరీష, ఒంగోలు ఏసీబీ అధికారులు సి.ఐ. రమేష్,శేషు,ఎస్సై ప్రసాదు మస్తాన్ షరీఫ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది.

25న కొమరోలు మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 25న నిర్వహించబడుతుందని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షత వహిస్తారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జడ్పిటిసి, మండల కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

102 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - తాళ్లూరు: తూర్పుగంగవరం పీహెచ్సీ పరిధిలో బెల్లంకొండ వారి పాలెంలో శనివారం 104 సేవలు డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అందలించారు. చిరు వ్యాధులను 102 మందిని పరిశీలించి పరీక్షలు నిర్వహించి మందులు అందించారుజ. పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. ఎం ఎల్ హెచ్ పీ నాగార్జున, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు మంజుల, కోటేశ్వరమ్మ, ఈ శ్వరమ్మ . మరియమ్మలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగించుకోవాలి

-మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : డ్వాక్రా సంఘాలకు ప్రభు త్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికు మార్ అన్నారు. నియోజకవర్గంలోని 13 మంది డ్వాక్రా మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.17,50,000 లక్షల చెక్కును శనివారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ సబ్సిడీ రుణాలతో డ్వాక్రా మహిళలు చిరు వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా కుటుంబ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్, ఉన్నతి ఏపిఎం ఫణి బాబు, ఐదు మండలాల ఏపీఎంలు, సీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సేద్యపు నీటి కుంటలతో ఉపయోగాలు

విశాలాంధ్ర - పర్చూరు : సేద్యపు నీటి కుంటలతో రైతు లకు బహుళార్థ ఉప యోగాలు ఉన్నాయని డ్వామా బాపట్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఏవీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో పంట కుంటలను పీడీ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట కుంటలను రైతులు ప్రోత్సహించాలని తెలిపారు. ఉపాధిహామీ పనులు వేగవంతం చేసి ఎక్కువ రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు పనులను పరిశీలించాలని తెలిపారు. వీరి వెంట ఎంపిడిఓ ప్రద్యుమ్నకుమార్, ఏపీఓ బుల్లియ్య, సిబ్బంది ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - పర్చూరు : బాలికలకు పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని న్యాయమూర్తి శాంతి తెలిపారు.రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మండలంలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాలికలకు మంచి, చెడు ప్రవర్తనలపై అవగాహన ఉండాలని,ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే వారిపై ఫిర్యాదును 1098 ఫోన్ నెంబర్‌కు చేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసుంధర దేవి, న్యాయవాదులు రవీంద్రనాథ్ రెడ్డి,జాన్ బాబు, ఎస్సై మాల్యాద్రి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్స్య సంపద,ఆక్వా సాగు పెంచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం

- మత్స్య శాఖ రాష్ట్ర కమిషనర్ రమా శంకర్‌నాయక్

విశాలాంధ్ర - బాపట్ల : మత్స్య సంపద,ఆక్వా సాగు పెంచడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మత్స్య శాఖ రాష్ట్ర కమిషనర్ రమా శంకర్ నాయక్ అన్నారు. బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్ రమా శంకర్ నాయక్ స్థానిక కలెక్టరేట్‌కు శనివారం చేరుకున్నారు.జిల్లాకు తొలిసారిగా వచ్చిన కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చంతో అభినందనలు తెలిపారు.కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ ఉన్నారు. అనంతరం బాపట్ల,చీరాలలోని రొయ్యల హేచరీలు,పాలీచీట్ యూనిట్లు, బయోఫ్లోక్ టెక్నాలజీతో నడిచే యూనిట్లు,రొయ్యల ఫామ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఆయన పరిశీలించారు. జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణ కిషోర్,మత్స్యశాఖ అధికారులు,ప్రాసెసింగ్ యూనిట్ల నాయకులు ఉన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు మెండు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చిరుధాన్యాలు చిన్నవే అయిన పోషక విలువలలో మహా మెరుగైనవి అని జన్యు శాస్త్ర మొక్కలశాస్త్ర విభాగం ప్రొఫెసర్ హెడ్ డాక్టర్ లాల్ అహ్మద్ తెలిపారు. సేంద్రియ చిరుధాన్యాలు సాగు, సస్య రక్షణ,ఆరోగ్య ఉపయోగాలు ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు పోషక ఆహార ఘనులు అని, చిరుధాన్యాలు వాతావరణ మార్పులను తట్టుకుంటాయని వివరించారు.రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ మండవ శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరుధాన్యాల ఆరోగ్య ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్ర మంలో కీటక శాస్త్ర విభాగ ప్రొఫెసర్ డాక్టర్ మధుమతి, వ్యవసాయ వాతావరణ శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ కే.శ్రీనివాస రావు, డాక్టర్ వినయ్‌కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.తుషార పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నేత అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ కొమరవోలు గ్రామం నుంచి ప్రజ్ఞం పంచాయతీ చెక్కావారిపాలెం గ్రామానికి వెళ్లేందుకు రేపల్లె మెయిన్ డ్రైన్‌పై రూ.8.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వంతెన, రహదారి నిర్మాణానికి శనివారం అనగాని శివప్రసాద్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన, అభి వృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రి అనగాని సత్యప్ర సాద్ నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు పోతుంద న్నారు. తీర ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల చిరకాల కోరిక అయిన ఈ వంతెన నిర్మాణం కూటమి ప్రభుత్వంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో నెరవేరబోతుందన్నారు. ఈ వంతెన, రహ దారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, సంబంధిత అధికారులకు అయన సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధ రావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, ప్రజ్ఞం నీటి సంఘం అధ్యక్షుడు రాగం కళ్యాణ్, టీడీపీ నాయకుడు నల్లపాటి ఎల్లయ్య, టీడీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో అనధికారికంగా ఆక్రమించబడిన నివాస గృహాలను క్రమబద్ధీకరణ చేయుటకు గాను భూ ముల క్రమబద్ధీకరణ 2025కు సంబంధించి దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీలోగా చేసుకోవాలని రేపల్లె ఆర్డిఓ ఎన్ రామలక్ష్మి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు భూమి క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. పథకం కింద రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో గల అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. 15 అక్టోబర్ 2019నాటి లేదా దానికన్నా ముందుగా ఆక్రమించబడిన అభ్యం తరం లేని ప్రభుత్వ భూములు మాత్రమే పరిధిలోకి వస్తాయన్నారు .కేవలం ఇల్లు నిర్మించిన కుటుంబాల వారు మాత్రమే అర్హులన్నారు.మహిళా కుటుంబ సభ్యుల పేరుతో మాత్రమే పట్టా మంజూరు అయి ఉండాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆధార్ కార్డుతో పాటు విద్యుత్తు,నీటి బిల్లులు వంటి ఆధారాలు సమర్పించాలని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత కాల గడు వుకు ముందే దరఖాస్తులు చేసుకున్న ఎడల పరిశీ లించి అర్హత మేరకు అభ్యంతరములు లేని ప్రభుత్వ భూములలో అనధికారికంగా ఆక్రమించబడిన గృహాలను భూముల క్రమబద్ధీకరణ 2025 క్రింద క్రమబద్ధీకరణ చేయబడునని ఆమె తెలిపారు.

నవ వధూవరులకు గాదె మధుసూధనరెడ్డి ఆశీర్వచనం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని పరిశావారిపాలెం గ్రామంలో తన అభిమాని వివాహ రిసెప్షన్‌లో శనివారం వైఎస్ఆర్సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన రెడ్డి హాజరై నూతన వధూవరులైన సుబ్బారెడ్డి,శివపార్వతిలను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట గోవతోటి విజయ్, కుంచల వీరరాఘవరెడ్డి, దేగల రవిరెడ్డి, అలవల అశోక్ రెడ్డి, బాల శివకృష్ణారెడ్డి, కుంచల కిరణ్‌కుమార్ రెడ్డి, దొంతిమాను గోపిరెడ్డి, కావూరి శ్రీనివాసు రెడ్డి, గాదె యువసేన, పాల్గొన్నారు.

అనిల్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - వేమూరు : వేమూరు ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో గంగోత్రి వాటర్ ప్లాంట్ అధినేత పాముల అనిల్ ఏర్పాటు చేసిన చలివేంద్రంను తహసీల్దార్ సుశీల శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా వైద్యశాల వైద్యులు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని,డాక్టర్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ,సిబ్బంది, బాటచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. గంగోత్రి వాటర్ ప్లాంట్ పెట్టిన నాటి నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు గంగోత్రి యాజమాన్యం ద్వారా అనిల్ చేస్తున్నారని ఇక ముందు కూడా ఇలాంటివి మరెన్నో చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరారు.అనంతరం రోగులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బుస్సా నాగరాజు,సామాజిక సేవా కార్యకర్త అన్నే సుశీల, పాముల సాయి చరణ్, డిప్యూటీ తాహాశీల్దార్ రవీంద్ర, ఆర్ఐ సాయి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోపు ఇంటి పన్నులు చెల్లించాలి



విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పురపాలక సంఘమునకు 2024-2025 ఆర్థిక సంవత్సర మునకు చెల్లించవలసిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, ఖాళీ స్థలము పన్నులు చెల్లించుటకు ఇం కనూ వారం రోజులు మాత్రమే ఉన్నదని బాపట్ల పుర పాలక సంఘం కమిషనరు జి. రఘునాథ రెడ్డి తెలిపారు. ఆస్థి యజమానులు వెంటనే పురపాలక సంఘంలో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కౌంటర్‌లో గాని, వార్డు సచివాలయములో గాని ఆన్లైన్‌లో గాని పన్నులను చెల్లించి తగు రశీదు పొందవలెనని తెలి పారు. చివరి రెండు రోజులు అనగా ఈ నెల 30 ఉగాధి పండుగ ఈ నెల 31 రంజాన్ పండుగ కారణంచే శెలవు రోజులైనప్పటికి పన్నులు చెల్లించుకొబడునని కమిషనర్ తెలిపారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com ఆదివారం 23 । మార్చి । 2025

పలువురికి మంత్రి గొట్టిపాటి పరామర్శ

విశాలాంధ్ర – అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండలంలో అనారోగ్యంతో బాధపడు తున్న పలువురిని శని వారం పరామర్శించారు. అద్దంకి పట్టణానికి చెందిన గట్టుపల్లి రామారావు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకోగా అతనిని మంత్రి పరామర్శించారు. మండల తెలుగుదేశంపార్టీ నాయకులు కలవ కూరుకు చెందిన కటారి నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా అతని ఇంటికి వెళ్లి నాగేశ్వరరావును మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట మండల తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్లజోళ్ళ పంపిణీ

విశాలాంధ్ర – చీరాల : లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల అంకినీడు ఆధ్వర్యంలో శనివారం చీరాలలోని కస్తూరిబా గాంధీ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో 38 మంది విద్యార్థులకు చీరాల మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ చేతుల మీదుగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు.ఫిబ్రవరి నెలలో పాఠశాలలో ఉచిత ఐ క్యాంప్ నిర్వహించి కంటి లోపాలు ఉన్న 38 మంది విద్యార్థులకు శనివారం కళ్ళజోళ్లను పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డి.శ్రీనివాసన్,సెక్రటరీ నల్లూరి కృష్ణ,క్లబ్ సభ్యులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.కృష్ణమోహన్ రావు, పివి బాబు పాల్గొన్నారు.

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్యశిబిరం

విశాలాంధ్ర – బాపట్ల : నియోజకవర్గంలో వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి హాస్పిటల్ పెదకాకాని వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుని కంటి శుక్లాలు ఉన్న వృద్ధులకు ఆపరేషన్లు నిర్వహించిన వారికి శనివారం బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తే దాదాపు 93 మందికిపైగా కంటి శుక్లాలతో బాధపడుతున్నట్టు నిర్ధారణ అయిందన్నారు.వారి అందరిని మా ఫౌండేషన్ తరపున విడతల వారిగా పెదకాకాని శంకర కంటి హాస్పిటల్‌కు పంపించి ఆపరేషన్‌లు చేపించడం జరిగిందన్నారు.ఆపరేషన్‌లు చేయించుకొన్న వారికి శనివారం నాణ్యమైన కళ్ళజోళ్ళను ఉచితంగా అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా నాణ్యతలో రాజీ పడకుండా ఖర్చు ఎక్కువైన సరే మంచి కళ్ళజోళ్ళను అందించామన్నారు.రాబోయే రోజుల్లో మా ఫౌండేషన్ ద్వారా మరోసారి వైద్య శిబిరం నిర్వహించి మరింత మందికి కంటి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి హాస్పిటల్ పెదకాకాని వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ 60మందికి పార్టీ సాధికారత సారధులను నియమించాలి

- ఎమ్మెల్యే ఆనందబాబు

విశాలాంధ్ర – వేమూరు : ప్రతి తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుడు కుటుంబ సాధికారత సారధిగా నమోదు కావాలని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు సూచించారు.శనివారం వేమూరు నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధానాల మేరకు ప్రతి 60 మందికి ఒక సాధికారత సారథి ఉండాలని పార్టీ నిర్ణయించిందని, అందులో భాగంగా పార్టీ నాయకులు సాధికారత సారదులుగా ఉండాలన్నారు. అదేవిధంగా పార్టీ సభ్యత కార్డులు సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్త కు అందించాలన్నారు. సభ్యత్వ నమోదులో వేమురు నియోజక వర్గం బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అందుకోసం కష్టపడిన కార్యకర్తలను అభినందించారు. పట్టభద్రులు ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆలపాటి రాజాకి వేమూరులో జరిగే అభినందన సభను దిగ్విజయం చేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు విధిగా పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగా సాంబి రెడ్డి, జొన్నలగడ్డ విజయబాబు, దండే సుబ్బారావు, డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా, మైనేని మురళీకృష్ణ, శివారెడ్డి, ఎల్లారెడ్డి, గొట్టిపాటి భాను గంగాధర్, శేషు బాబు పాల్గొన్నారు.

మాజీ సైనికులసంఘం రాష్టకమిటీ ఎన్నికలు నేడు

- గెలిపించాలని అభ్యర్థి తాండ్ర సాంబశివరావు విజ్ఞప్తి

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : విజయవాడలో రాష్ట్ర స్థాయిలో మాజీ సైనికులకు ఎన్నికలు ఆదివారం జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ అభ్యర్థి మాజీ సైనిక సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబాశివరావు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి మాజీ సైనికులకు రాష్ట్ర స్థాయి అసోసియేషన్ కోసం ప్రత్యక్షంగా జరుగుతున్న ఎన్నికలు విజయవాడలోని ఫ్రీడం ఫైటర్స్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర నలుమూలలు నుంచి వస్తున్న మాజీ సైనికులు అందరూ సౌకర్యవంతమైన ప్రయాణం చూసుకుని జాగ్రత్తగా రావాలని కోరారు.తాండ్రకి ప్రత్యర్థిగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అధ్యక్షుడు గరిమెళ్ళ శివ నాగేశ్వరరావు బరిలో ఉన్నట్లు తెలిపారు.ఉపాధ్యక్ష పదవికి అనంతపురం జిల్లా అధ్యక్షులు పి.విశ్వేశ్వరరావు ఒక వైపు బరిలో ఉండగా ఆయన ప్రత్యర్థిగా కర్నూలు జిల్లా అధ్యక్షులు పేరయ్య చౌదరి బరిలో ఉన్నారన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి రాజ మండ్రికి చెందిన ప్రముఖ న్యాయవాది డాక్టర్ సూరెడ్డి శివకుమార్ పోటీ చేస్తూ ఉండగా,ఆయన ప్రత్యర్థిగా ప్రకాశం జిల్లా గిద్ద లూరు అసోసియేషన్ సెక్రటరీ ఎం.గురుప్రసాద్ పోటీ చేస్తున్నారని తెలిపారు. సంయుక్త కార్యదర్శిగా శ్రీకాకుళం జిల్లా పలాస అసోసియేషన్ అధ్యక్షులు మన్మథరావు ఒక వైపు బరిలో ఉండగా ఆయన ప్రత్యర్థిగా విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం వాస్తవ్యులు కాకి వెంకట రమణా రెడ్డి పోటీ చేస్తున్నారని కోశాదికారిగా విజయవాడ ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఉమామహేశ్వర రావు పోటీలో ఉండగా ఆయన ప్రత్యర్థిగా చిత్తూరు జిల్లా సీనియర్ మాజీ సైనికులు కలిశెట్టి సిద్దయ్య పోటీలో ఉన్నారన్నారు.

హెచ్ఐవి నియంత్రణ అందరి బాధ్యత

విశాలాంధ్ర – కొరిశపాడు : హెచ్ఐవిను నియంత్రించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని హెచ్ఐవి బాధితులతో వివక్షత చూపించకూడదని వాళ్ళ హక్కులకు భంగం కలిగించకూడదని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మేదరమెట్ల టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి సాగర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య విధాన శాఖ, దిశ జిల్లా హెచ్ఐవి,ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించి హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ పీడీ సాగర్ మాట్లాడుతూ సురక్షిత లైంగిక అలవాట్లు ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించకుండా ఉంటాయని చెప్పారు. గర్భిణీ స్త్రీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పూర్తి అవగాహన గోడ పత్రికలను ప్రభుత్వ ప్రభుత్వ సంస్థల్లో ఏర్పాటు చేయడం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కలిగిస్తే ఈ వ్యాధిని నియంత్రణించటం సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయి వరకు పాల్గొనాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెల్ప్ టిఐ మెదరమెట్ల ప్రోగ్రాం మేనేజర్ డి.సిహెచ్ కోటేశ్వరావు,ఎంఈఏ టి.అనిల్ కుమార్, మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, నాగులప్పలపాడు మండలాల అవుట్ రిచ్ వర్కర్లు కే.దుర్గా, ఎం.సామ్రాజ్యం, కృష్ణవేణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

27న ఎంపీపీ పదవికి ఎన్నిక

విశాలాంధ్ర – పిట్టలవానిపాలెం : రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారిచే జారీ చేయబడిన షెడ్యూలు మేరకు పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్తుకు సంబంధించి ఖాళీగా ఉన్న మండల ఎంపీపీ పదవికి ఈ నెల 27న ఉదయం 11 గంటలకు స్థానిక పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ సమక్షంలో ఎంపీటీసీ సభ్యులచే ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఐ.సత్య నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి హనుమంతరావు

-మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర – యద్దనపూడి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి హనుమంతరావు అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ అన్నారు. యద్దనపూడిలో జరిగిన మాజీ మంత్రి స్వర్గీయ గొట్టిపాటి హనుమంతురావు 28వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్క ళంక రాజకీయాలకు నిలువెత్తు రూపం,సుధీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అవినీతి మరక అంటని ఆదర్శ ప్రాయులు, చేపట్టిన పదవులకే వన్నె తెచ్చిన మహనీయుడు హనుమంతురావు అని అన్నారు. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధిలో చెరగని ముద్ర వేసిన ఆయన చిరస్మరణీయులు,సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, ఎల్ఎంబి బ్యాంకు చైర్మన్‌గా, సంతమాగులూరు సమితి అధ్యక్షునిగా, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మార్టూరు నియోజకవర్గ శాసనసభ్యునిగా ప్రస్థానం సాగించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో పౌర సరఫరాల శాఖామాత్యులుగా పనిచేసిన మచ్చలేని నిస్వార్ధ రాజకీయ నాయకునిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి రాంబాబు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొరిశపాడు : మేదరమెట్లలో అర్ధరాత్రి సుమారు గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసు తెలిపిన వివరాలు మేరకు అద్దంకి పట్టణం దామావారిపాలెంకు చెందిన ఏలూరి ఆదినారాయణ తండ్రి పోతురాజు (24) తన సొంత పని నిమిత్తం ఒంగోలు వెళ్లి తిరిగి అద్దంకి వచ్చుచుండగా మేదరమెట్ల గ్రామం ఫైలాన్ ఫ్లైఓవర్ దాటిన తర్వాత ఎన్ హెచ్ 16 ఒంగోలు టు గుంటూరు రోడ్డులో నుండి అద్దంకి వైపు వెళ్ళు సర్వీస్ రోడ్‌లోకి తన మోటార్ సైకిల్ ఎపి 39 హెచ్ ఎఫ్ 1698 నెంబర్ గల ద్విచక్ర వాహనం రోడ్డు క్రాస్ చేస్తుండగా అదే రోడ్‌లో గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఆదినారాయణ నడుపుతున్న మోటార్ సైకిల్‌ను గుద్ది వెళ్లిపోయినట్లు ఈ ప్రమాదంలో ఆదినారాయణ రోడ్డుపై క్రింద పడిపోగా తలకు బలమైన రక్తగాయమై అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు.ఈ విషయంపై మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర - పిసిపల్లి : పిసిపల్లి మండలంలోని దివా కరపురంలో రిలయన్స్ కంప్రె సెడ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి వచ్చే నెల 2వ తేదీన భూమి పూజ చేయనున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా కొన సాగుతున్నాయి. హెలిప్యాడ్ నిర్మాణం బహిరంగ సభ స్థలం రహదారి సౌక ర్యం కంపచెట్ల తొలగింపు చర్యలు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ కార్యక్ర మానికి మంత్రులు లోకేష్, గొట్టిపాటి రవి, డోల బాలా వీరాంజనేయ స్వామి రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత అంబానీ ప్రముఖులు హాజరవుతుండడంతో అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

వ్యవసాయపు నీటి కుంటలు ఏర్పాటు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన వ్యవసాయపు నీటి కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని దోర్నాల మండల అధికారులు టిడిపి నాయకులు తెలిపారు. మండలంలోని ఐనముక్కల గ్రామంలో ప్రపంచ నీటి దినోత్స వాన్ని పురస్కరించుకొని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం ఫౌండ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వర్షాభావ పంటలకు ఈ నీటి కుంటలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అవసరమైన రైతులు ప్రతి ఒక్కరూ నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి ఉపాధి పథకం ఎపిఒ, వినయ్, దోర్నాల మండల టిడిపి కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి, చంటి, ఈసీ చాణిక్య, టిఏలు, భాష, నాగేశ్వరరావు, వినోద్, ఏ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు రామ్ రెడ్డి, భాష, ఉపాధి హామీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు, మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తారు విందు

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర - కర్లపాలెం : పవిత్ర రంజాన్ మాసాంతం ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కర్లపాలెం దండుబాట రోడ్డులో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన ఇస్తారు విందులో ఎమ్మెల్యే వేగేశన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు విందు వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని,మనమంతా సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బౌడా చైర్మన్ సలకల రాజశేఖర్ బాబు, నాయకులు తాతాజీ ప్రకాష్ నారాయణ, నక్కల వెంకటస్వామి, ఖాజా మొహిద్దీన్, షేక్ బాజీ, పఠాన్, పిట్ల వసంత రెడ్డి, పాల్గొన్నారు.

అధికారులు సేవా దృక్పథంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక ఎంపీడీవో కార్యాలయములో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వారి సమస్య లను త్వరితగతిన పరిష్క రించాలన్నారు. ఫిర్యాదు దారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా అధికారులు సేవ దృక్ప థంతో పనిచేసి సమస్యకు పరి ష్కారం చూపాలని అధికా రులకు సూచించారు. కని గిరితో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి ప్రజలు వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాలు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను మార్చొద్దు

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థులకు సంబంధించి ఎస్సీ హాస్టల్ ఒక్కటే ఉన్నందున హాస్టల్ ను వేరే ప్రాంతానికి మార్చవద్దని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, మాలల ఐక్యవేదిక నాయకులు కల్వకూరి శాంతరాజు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు కోటికల బాలబాదుర్ల ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 46 సంవత్సరాల నుంచి కనిగిరి పట్టణంలో ఒకే ఒక్క ఎస్సి హాస్టల్ ఉందన్నారు. నియోజకవర్గంలో 6 మండలాల గ్రామాలలోని ఎస్సీ విద్యార్థులు ఈ హాస్టల్లో ఉండి చదువు కొనసాగిస్తుంటారని తెలిపారు. ఉన్నపలంగా హాస్టల్ వేరే ప్రాంతంలో ఏర్పాటు చేస్తే వారు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాంతంలోనే ఎస్సీ హాస్టల్ ను కొనసాగించాలని వారు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అదనాతన భవనాన్ని నిర్మించి భవిష్యత్ తరాలకు మెరుగైన అవసరాల దృష్ట్యా నూతన భవనాన్ని డివిజన్ స్థాయిలో నిర్మిస్తామని హాస్టల్ ఎక్కడికి తరలించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిటి మహేష్, కళ్ళు వెంకట్ నారాయణ, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కేజీబీవీల్లో ఆన్‌లైన్ దరఖాసుల స్వీకరణ

విశాలాంధ్ర - పెద్ద దోర్నాల : 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దోర్నాల కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎల్ అనూష శని వారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనూష మాట్లాడుతూ!సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ,ఆన్ లైన్ దరఖాస్తులు మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, ఆరవ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అలాగే 12వ తరగతి నందు 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని, తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అనూష తెలిపారు. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతల దోర్నాల సబ్ యూనిట్ పరిధిలోని కడప రాజు పల్లె గ్రామంలో శనివారం కీటక జనిత వ్యాధుల నియంత్రణ గురించి మండల ప్రాథమిక పాఠశాల, ఎస్సీపాలెం అంగన్వాడీ కేంద్రములో నిర్వహిం చారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ,ఇంట్లో పరిసరాలలో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని, తద్వా రా వచ్చు వ్యాధులూ మలేరియా,డెంగ్యూ, చికన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులూ దరిచేరవు అని కూడా చెప్పారు. కూలర్లు, ఫ్రిజ్‌లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి బోండాల్లో, ప్లాస్టిక్ వ్యర్థాలలో నీటిని ఎప్పటికప్పుడు పారపోసి ఆరబెట్టి వాడుకోవాలని కూడా చెప్పారు. లార్వా సర్వే నిర్వహించారు. దోమతెరలు ఉపయోగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దోర్నాల సబ్ యూనిట్ ఆఫీసర్ సి హెచ్. రమేష్ బాబు, మలేరియా సూపర్వైజర్ కందుల ఇశ్రాయే లు, ఆరోగ్య కార్యకర్త సుబ్బాయమ్మ, ఆశా కార్య కర్త ఆది లక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్, ఆయా, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగం

విశాలాంధ్ర- సంతనూతలపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని సంతనూతలపాడు టీడీపీ గ్రామ అధ్యక్షులు బొడ్డు శంకర్ ఆరోపించారు. స్థానిక టిడిపి మండల కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శంకర్ మాట్లాడుతూ సంతనూతలపాడు గ్రామంలో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకంలో లక్షల రూపాయలు నిధులు దుర్వినియోగం అయినట్లు తెలిపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీలలో భాగంగా మట్టి మురం రోడ్లు, చెక్ డ్యాం రిపేరు మరియు మెయింటెనెన్స్, చెరువులలో మట్టి తవ్వకం, మొక్కల పెంపకం మొదలగు పనులలో దాదాపు రూ5,60,000 లక్షలు నిధులు జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది స్వాహ చేసినట్లు తెలిపారు. గ్రామ నాయకులు చిట్టింశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చెక్ మెజర్,జియో టాకింగ్, మస్ట్రోల్ వెరిఫికేషన్, పని ప్రదేశంలో పౌర సమాచార పట్టికలు, మెజర్మెంట్ బుక్ నకలు, ప్రథమ చికిత్స పెట్టె, మందులు, జాబ్ కార్డుల నిర్వహణ,పని పత్రాలలో పనికి ముందు, చేసేటప్పుడు, తర్వాత ఫోటోలు మొదలగు విధులను సిబ్బంది తూతు మంత్రంగా నిర్వహించి నిధులను స్వాహా చేసినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో గతంలో జరిగిన అవకతవకలను వెలుగులోకి తీసుకువస్తామని తెలిపారు. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టి.ఎన్.టి.యు.సి మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, టిఎన్టియుసి బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ స్వామి చౌదరి, బీసీ సెల్ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసరావు,గ్రామనాయకులు ఈసమావేశంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- ఘనంగా మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి
- దివ్యాంగులకు 40 స్కూటీలను అందించిన మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పెదనాన్న మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి వేడుకలు శనివారం అద్దంకి నియోజకవర్గంలో ఘనంగా జరి గాయి. తొలుత యద్దనపూడి గ్రామానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానికంగా ఉన్న పెదనాన్న హనుమంతరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అద్దం కి చేరుకున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అద్దంకి పురపాలక సంఘం కార్యాలయంలో గొట్టి పాటి హనుమంతరావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. దాతలు ఎన్ఆర్ఆర్, అసిస్టెంట్ ఇండియా సంస్థల సహాయ సహకారాలతో సేకరించిన సుమారు 40 త్రిచక్ర స్కూటీలను దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి అం దించారు. అనంతరం లబ్ధిదారులైన 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. దివ్యాంగులకు స్కూటీలు అందించడానికి ముం దుకు వచ్చి, అద్దంకి నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసే కార్యక్రమంలో భాగమైనందుకు దాత లను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అభినందిం చారు. అద్దంకి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభ పరిణామమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గతంలో కూడా సిఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి గుర్తు చేశారు. నియోజకవర్గం లోని చాలా ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చకచకా జరుగుతోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సుమారు 9 కమ్యూనిటీ హాళ్ళ నిర్మించినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదికి మరో 10 కమ్యూనిటీ హాల్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. దాతల సహకా రంతో అద్దంకి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠ శాలలో చదువుకుంటున్న ప్రతి మహిళా విద్యార్థికి ఉచితంగా సైకిళ్లను అందజేస్తా మని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు అద్దంకి నియోజకవర్గంలో వ్యాపా రులు వ్యాపారం చేసే పరిస్థితులు లేవని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత వ్యాపారులకు అండగా నిలుస్తాం దని తెలిపారు. స్థానికంగా ఉండే యువతకు ఉపాధి కల్పించేందుకు ఎవరు ముం దుకు వచ్చిన వారికి మద్దతు ఇచ్చి ప్రోత్సహిస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రజావేదిక నిర్వహించిన మంత్రి గొట్టి పాటి రవికుమార్ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశిం చారు. నియోజకవర్గంలో కొంత మంది దీపం పథకం లబ్ధిదారులకు సబ్సిడీ అందడం లేదు అనే విషయాన్ని మంత్రి గొట్టిపాటి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సచివాలయం ఉద్యోగులతో చర్చించి ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు సబ్సిడీ అందేలా ఆదేశాలు జారీ చేశారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక నిర్ణయం

విశాలాంధ్ర - రేపల్లె : ఎస్సీ వర్గీకరణ చేస్తూ రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని పేర్కొంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగలకు కృతజ్ఞతలు తెలుపుతూ రేపల్లె నియోజకవర్గం ఎంఆర్పిఎస్ నాయకులు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగజీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం హర్షనీయమని పేర్కొంటూ ఎంఆర్పిఎస్ నాయకులు ఆలూరి బిక్షాలు,ఆలూరి డానియల్, కూచిపూడి మోహన్‌రావు,కూచిపూడి రవీంద్ర, జూలకంటి బుజ్జిబాబు,బుర్రె సత్యనారాయణ, కిషోర్, భాస్కర్, చక్రపాణి, నాగేశ్వరరావు, బేతపూడి వెంక టేశ్వరరావు, సురేష్, కిషోర్, ఎన్. నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు,తదితరులు పాల్గొని హర్ష వ్యక్తం చేశారు.

నీరు సమస్త జీవానికి మూలం

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర - గిద్దలూరు : ప్రతీ నీటి బొట్టు చాలా విలువైనదని, నీటి బొట్టును వృధా చేయ డం మన భవిష్యత్తును కోల్పోవడమేనని గిద్ద లూరు ఎమ్మెల్యే ముత్తు ముల అశోక్ రెడ్డి అన్నారు. "ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా గిద్దలూరు మండలం, తిమ్మాపురం గ్రామంలోని పలు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ నీరు లేదంటే సమస్త జీవరాశుల మనుగడ లేదని, కనుక ప్రతి నీటి బొట్టును దాచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు నీటిని ఆదా చేసే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అవగాహన కార్యక్ర మాలు చేపడుతుందని, నీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పసుపుల మల్లీశ్వరయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎండీవో రమణారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది మరియు తెలుగుదేశం సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడి



విశాలాంధ్ర - బాపట్ల : యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బెట్టింగ్ వలన కలిగే అనర్థాల గురించి జిల్లా ప్రజలకు, యువతకు అవగాహన కలిగించేందుకు జిల్లా ఎస్పీ శని వారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 22 నుండి ఐపీఎల్ మ్యాచ్లు మొదలవు తున్నాయన్నారు. వీటిని అదునుగా చేసుకొని కొం దరు స్వార్థపరులు, చెడు నడత కలిగిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌లకు తెరలేపే అవకాశం ఉంద న్నారు. బెట్టింగ్‌లకు బలి అవుతున్నవారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారన్నారు. సులభంగా అధిక నగదును అర్జించవచ్చునని యువతకు ఆశ చూపుతూ బెట్టింగ్ ఊబిలో దించుతారన్నారు. ఒక్క సారి బెట్టింగ్‌లకు అలవాటు పడితే వాటి నుండి బయటకు రావడం కష్టత రం అవుతుందన్నారు. బె ట్టింగ్‌లో ఒకసారి ఆదా యం వచ్చినా పలుమార్లు నష్ట పోవడం జరుగుతుం దన్నారు. ఆ నష్టాలను భర్తీ చేసుకోవడానికి, చేసిన అప్పులను తీర్చడానికి యు వత దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తుని అంధకారం చేసుకుంటున్నార న్నారు. బెట్టింగ్ అనేది పెనుభూతం లాంటిదని, ఆశ చూపి పాతాళానికి నెట్టేస్తుందని యువత దా నికి బలికాకుండా అప్రమ త్తంగా ఉండాలన్నారు. క్రికెట్ మ్యాచ్‌లను వినోదం కోసం మాత్రమే చూ డాలని, బెట్టింగులు వైపు మొగ్గు చూపకూడద న్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై, తమ ఉజ్వ ల భవిష్యత్తు పై దృష్టి సారించాలన్నారు. తమ తల్లి దండ్రుల ఆశయాల సాధన కోసం ఉన్నతంగా జీవించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. బెట్టింగులకు పాల్పడు తుంట్లయితే వారికి నచ్చచెప్పి ఆ ఊబిలో నుండి బయటకు తీసుకు రావాలన్నారు. గతంలో బెట్టింగ్ లకు పాలపడిన వారిపై, అనుమానితులపై నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగులను నిర్వహించినా, అమాయకులను, యువతను బెట్టిం గ్ ఊబిలోకి లాగాలని ప్రయత్నించినా ఉపేక్షిం చబోమని, నిర్వాహకులను గుర్తించి వారి పై చట్ట పరమైన తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు జరు గుతు న్నట్లు తెలిస్తే డయల్ 112/100కు (లేదా) సంబం ధిత పోలీస్ అధికారులకు కాల్ చేసి సమా చారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

పదోన్నతుల సీనియర్ జాబితాను

మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం తయారు చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - మార్కాపురం : ఉపా ధ్యాయుల పదోన్నతుల జాబితాలో ఉన్న తప్పు లను సవరించి మెరిట్ కంరోస్టర్ ప్రకారం తయారు చేయాలనీ ఎస్‌టియు జిల్లా శాఖ పక్షాన జిల్లా విద్యాశాఖ ధికారికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఎస్‌జిటి నుండి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించినప్పుడు మెరిట్ కంరోస్టర్ విధానం పాటిం చకుండా సెల్కక్షన్ ప్రకారం పదోన్నతులు కల్పించడం వల్ల పదోన్నత జాబితాలో తప్పు లు తడకలు ఉన్నాయని, కావున ఇప్పుడైనా మెరిట్ కం రోస్టర్ ప్రకా రం తయారు చేయాలని, అలాగే 2023 లో కోర్టు కారణంగా నిలిచిన పదో న్నతులు ముందుగా జరిపిన తర్వాతనే పదోన్నతులు కల్పించాలని కోరారు. పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం నుండి మినహాయింపు కోరిన వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్య క్షుడు కె. ఎర్రయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి జి నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు నర్రా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరాకు పక్కా ప్రణాళిక సిద్ధం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా ప్రణా ళికతో చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమి షనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.ఒక కోటి 8 లక్షల వ్యయంతో వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలో ఉన్న 560 చేతిపంపులకు తోడు ఎనిమిది లక్షలతో కొత్త పంపులు మరమ్మత్తులకు గురైన వాటిని బాగు చేయించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది పెరగనున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎక్కడ నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేలా అవసరమైన ప్రాం తాల్లో ఐదు లక్షల రూపాయలతో చేతిపంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారం లో మున్సిపల్ తాలూకా మార్కెట్,రైల్వే స్టేషన్,ఆర్టీసి బస్టాండ్,నిజాంపట్నం రోడ్డు, అంకమ్మ చెట్టు, రింగ్ రోడ్డు, పెద్ద పోస్ట్ ఆఫీస్, ప్రధానకూడలి ప్రాం తాలలో 9 లక్షలతో 11 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చల్లని నీటితో పాటు పలుచోట్ల మజ్జిగ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుం టున్నామన్నారు. ప్రస్తుతం అరవపల్లి వాటర్ ప్లాంట్ లో ఉన్న 248 మిలియన్ల నీటిని రెండు నెలల పాటు సరఫరా చేసేందుకు సరిపోతుందన్నారు. ముందస్తు చర్యగా రూ.27 లక్షల ఖర్చుతో బోర్లు తీయించి మోటార్ల ద్వారా తోడిన నీటిని చెరువు నింపి ప్రజలకు త్రాగునీరు సరఫరా చేసేలా సన్నా హాలు చేస్తున్నామన్నారు. రూ.10 లక్షలతో శివారు వార్డులకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పట్టణం లో త్రాగునీటి ప్రధాన పైపులైన్లకు పడిన లీకుల మరమ్మత్తులకు రూ.49 లక్షలతో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయించి వృధాను అరికట్టేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తాగునీటిని పొదుపుగా వాడు కొని ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.